## మినీ కథ

# కొత్త బిచ్చగాడు

పైడిపాల

అందాన్ని మెచ్చుకుంటే అవి కళ్ళు- గుచ్చుకునే వరకు వస్తే అవే ముళ్ళు! బుక్‌స్టాల్ దగ్గర అంత అందమైన యువకుడు తనకేసి కళ్ళప్పగించిచూస్తే గర్వానికి ఒళ్ళు తెలియలేదు.

కాని నడిరోడ్డుమీద అతనే తనను వెంటాడుతున్నాడని తెలిసి అసహ్యంతో కళ్ళు జేవురించాయి.

రాజ హంసలా నడుస్తున్న రవళి అనుమానంతో మళ్ళీ వెనక్కి తిరిగి చూసింది- పది గజాల దూరంలో నీలం చారల షర్టు. వైట్ పాంట్....కనిపించాయి.

అతను తనను వెంటాడుతూనేవున్నాడు.

రెండు కళ్ళు తనను గుచ్చి గుచ్చి చూస్తున్నాయని తెలిసిన తర్వాత చేతులు. కాళ్ళు వళం తప్పుతున్నాయి. నడకకి నాట్యం వస్తోంది. 'తన తడబాటుని అతగాడు మరోలా అర్థం చేసుకుంటాడేమో!' అతి ప్రయత్నంమీద మరో పది అడుగులు వేసి వెనక్కి చూస్తే-ఎస్కార్ట్!

'ఇలా తిరిగి తిరిగి చూడ్డం అతణ్ని రెచ్చగొట్టడం అవుతుందేమో! అసలు తననే దృష్టితో అనుసరిస్తున్నాడో అర్థం కావడంలేదు.తన వొంటరితనంచూసి ఇంత ధైర్యంగా 'ఫాలో' అవుతున్నాడు. మురళి వచ్చిన తర్వాత ఇతని పని పట్టించాలి. ఆ మగమహారాజుకిబస్‌స్టాండులో రాచకార్యం తెమల్లేనట్టుంది. పదినిముషాల్లో వస్తానన్న పెద్దమనిషి అరగంటఅయినా అయిపులేడు. 'షాపింగ్' కని బయల్దేర దీసి ఇదేం పెత్తనాలో ఆయనకి? ఇలాంటి మనిషితో రావడం తనదే తప్పు!' మురళిమీద కోపంతో రవళి మొహం ఎర్రబడింది.

ఆ రోమియో తను వెనక్కి చూడ్డం గమనించినట్టున్నాడు, ఆగిపోయాడు. ఆ మాటకొస్తే అతగాడు రోడ్ సైడ్ రోమియోలాగా, జులాయిలాగా లేడు. హుందాగా ఉద్యోగిలా కనిపిస్తున్నాడు. అల్లరి గాంగ్‌తో ఆటలు పట్టించే స్టూడెంట్‌లాగ లేడు.మరి తనను వెంబడించటంలో అతని వుద్దేశ్యం?— వీడెవడో మేక వన్నె పులి. తనవెర్రిగాని లోకంలో సినిమాల్లోలా దుర్మార్గులంతా గళ్ళ లుంగీలు. కోర మీసాలు. నుదుట కత్తిగాట్లతో 'నేను రౌడీని' అని బోర్డు కట్టుకున్నట్టుగా వుంటారా?

'వీణ్నెక్కడో చూసినట్టు గుర్తు?- గుర్తుకి రావడంలేదు. అరే ఆ దుర్మార్గుడు కిళ్ళీకొట్టువాడికి తనని చూపించి ఏదో అడుగుతున్నాడు. వివరాలు. అడ్రసు అడుగుతున్నాడా?— లేక తనను మరో రకం మనిషిగా ...? ఛీ!ఛీ! అమ్మయ్య "మాధవీ బాంగిల్ స్టోర్స్" అనే పెద్ద పెద్ద అక్షరాలు తన కభయమిస్తున్నట్టు కనిపించాయి. ప్రస్తుతానికి ఈ షాపులో తలదాచుకొంటే ఈ రౌడీ బెడద తప్పుతుంది! గాజుల షాపులోకి వెళ్ళి "వెరైటీస్" చూస్తోంది రవళి.

"రెండు-ఆరుసైజులో లేటెస్ట్ మోడల్స్ చూపించండి"- మగ గొంతు వినిపించేసరికి తల పక్కకి తిప్పింది రవళి. వైట్ పాంట్- నీలం రంగు చొక్కా! 'వాడు తనవైపు క్రీగంట చూస్తున్నాడు- ఎంత ధైర్యం?' వాడివైపు 'వాడి'గా చూసింది.



ఆ కిళ్ళీ కొట్టువాడు తెలియదన్నట్టు తల అడ్డంగా ఆడిసున్నాడు. వీడి బారి నుంచి తప్పించుకోవడ మెలా?'— ఎదురుగా 'ఆ ముఖాన్ని ఎక్కడో చూసినట్లు గుర్తు. అవును— చెల్లెలు కరుణ కాలేజి 'గ్రూప్ ఫొటో' లో. ఇతను లెక్చరర్

సరికొత్త సీరియల్...

16వ పేజీ చూడండి

గిరిధర్. కరుణ ఫావరేట్ టీచర్.... అక్కౌంట్స్ అంత బాగా చెప్పే ఆయన మరొకరుండరట. అతని గురించి చాలా సొల్లు చెప్పింది — చాలా మంచివాడని. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ వుంటాడట. 'కరుణ' అతన్ని అంత అభిమానించడానికి కారణం? అతని 'వల'లో కాని పడలేదు కదా?

కాని కరుణ ఆ రకంగా అనుమానించాల్సిన ఆడపిల్ల కాదు. అన్నట్టు అతనికి ఈమధ్యనే పెళ్ళయినట్టు చెప్పింది—పైసా కట్నం తీసుకోకుండా ఆదర్శ వివాహం చేసుకున్నాడట! అతనే యితను? పదిమందికి పాఠాలు చెప్పే వ్యక్తి ఇంత సంస్కార హీనంగా ప్రవర్తిస్తాడా? అంత అభ్యుదయవాది ఇలా వెర్రి వేషాలేస్తాడా? లేదు-వీడు. లెక్చరర్ గిరిధర్ కాదు మనుషుల్ని పోలిన మనుషులుంటారు. వీడెవడో రౌడీ వెధవ ఎవడైనా ఇంత దారుణమైన సాహసమా?'

'వీణ్ని బయటకు పిల్చి చెంపలు వాయించడమా? - బీట్ కానిస్టేబుల్ని పిల్చి అప్పగించడమా?'- రోడ్డు వేపు చూసింది రవళి. రోడ్డు మీద తచ్చాడుతున్నాడు మురళి. 'అమ్మయ్య' అనుకొని "ఏవండీ" అంటూ పిల్చింది. ఆమె పిలుపు మురళికి వినిపించలేదు. ఆమె అవస్థ చూసి షాపు యజమాని చప్పట్లుకొట్టి మురళిని పిల్చాడు.

మురళిని చూసి 'వాడు' పారిపోతాడనుకొంది. కాని అతను కదల్లేదు. మురళి రాగానే ఏదో చెప్పబోయింది రవళి. కాని మురళి ఆమెను మాటాడనివ్వలేదు.

"వెరీ సారీ రవళీ. లేటయింది. బస్ స్టాండ్‌లో ఓ ఫ్రెండ్ కనిపించి కాఫీ తాగే వరకు వదల్లేదు. ఆ— ఇక వెళదామా? షాపింగ్ అయినట్టేనా?"

"హలో మురళీ!" వాడు.... అతను 'విష్' చేశాడు. రవళి ఆశ్చర్యపోయింది.

"హలో గిరీ వాట్ ఎ సర్‌ప్రయిజ్! నువ్విక్కడేం చేస్తున్నట్టు?" అతగాడ్ని కౌగలించుకొన్నంత పనిచేశాడు మురళి.

"ఈ ఊళ్ళోనే లెక్చరర్. మరి నువ్వు?"

'అయితే ఇతను కరుణ లెక్చరరే- తేనె పూసిన కత్తి' అనుకుంది కసిగా రవళి.

"విజయవాడలో బాంక్ ఆఫీసరుగా.... అత్తవారిది ఈవూరు. బై దిబై ఈమె నా వైఫ్ రవళి. వీడు డిగ్రీలో నా క్లాస్‌మేట్ గిరి" పరిచయం చేశాడు మురళి. అయిష్టంగానే నమస్కరించింది రవళి.

"ఇంకేమిటి కబుర్లు? చాన్నాళ్ళకి కలిశాం— రా. మా వాళ్ళ యింటికి వెళ్దాం" మురళి ఫుల్ స్టాప్ లేకుండా మాట్లాడేస్తున్నాడు. మిత్రుడి భార్యని తెలిసిన తర్వాత గిరి సిగ్గుతో చితికిపోతాడనుకొంది రవళి. కాని ఆ లక్షణాలేవీ గిరిలో కనిపించ లేదు. 'ఏవీ తెలియనట్టే వున్నాడు. ఈయనగారి అసలు రంగు మురళిదగ్గర బయటపెడితే?

"నీతో కొంచెం మాట్లాడాలి" గిరి అర్థింపుకు ప్రశ్నార్థకంగా చూశాడు మురళి. మురళిని పక్కకు తీసికెళ్ళి ఏదో చెబుతున్నాడు గిరి. జరిగినదానికి క్షమాపణ చెబుతున్నాడనుకొంది రవళి. కాని మురళి గిరి చేతిని తన చేతుల్లోకి తీసుకుని నవ్వుతూ రవళి దగ్గర కొచ్చాడు.

గాజులు కొనడం పూర్తి అవడంతో ముగ్గురూ షాపు నుంచి బయటపడ్డారు.

రవళికి 'గిరి ఏంచెప్పి వుంటాడా? 'అది ఆత్రుతగా వుంది అంతా సస్పెన్స్....

"రవళీ! మా గిరికి, క్రితం నెల్లోనే పెళ్ళయింది. మనం హనీమూన్‌లో వుండగా." అంటూ చిలిపిగా నవ్వాడు మురళి. "నీ మెళ్ళో నల్లపూసల గొలుసు డిజైన్ చాలా బావుందట తనకి. అటువంటిదే మరొకటికావాలనుకుని- నీ గొలుసు వివరాల కోసం యిందాకట్నుంచీ వెంటపడి అడగలేక మొహమాటపడ్డాట్ట సిల్లీ బోయ్" అంటూ, సిగ్గుపడుతున్న గిరి భుజం చరుస్తూ. "ఓసారి నీ గొలుసిలా గివ్వు" అన్నాడు. గొలుసు తీస్తున్న రవళి పెదవులపై చిరుహాసం మెరిసింది. ❁


విడుదలయ్యాయి శ్రీవంశీకృష్ణవారి వెరైటీ నవలలు!

సుప్రసిద్ధ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి అసాధారణరచన
**మానిని మనసు** .................. రూ.14/-

ప్రముఖ రచయిత్రి కె.రామలక్ష్మి అత్యద్భుత రచన
**కొత్త కోరిక** .................. రూ.16/-

సినీ రచయిత సి.వి.రమణ హ్యూమరొజికల్ సెటైర్
**ఫిల్మ్ తీసి చూడు** .................. రూ.12/-

ప్రఖ్యాత రచయిత్రి డా॥సి.ఆనందారామం విఖ్యాత రచన
**అందీ అందనిది** .................. రూ.13/-

అసాధారణ రచయిత ఎన్.ఆర్.నంది సైంటిఫిక్ సస్పెన్స్ థ్రిల్లర్
**మృత్యువుని మోసగించిన మనిషి** ...... రూ. 16/-

నవనవలా రచయిత గిరిజ శ్రీభగవాన్ హాట్ పొలిటికల్ సెటైర్
**రాజకీయమా వర్ధిల్లు** .................. రూ.16/-

* ఏ నవల కావల్సినా ఆ పుస్తకం ధరలో ఒకరూపాయి తగ్గించి M.O.పంపితే, ఆరూపాయికి V.P.పెట్టి కోరినపుస్తకం పంపగలం!

శ్రీవంశీకృష్ణ పబ్లికేషన్స్
గాంధీనగర్, విజయవాడ-520003 ఫోన్: 74331



తపాలుద్వారా చిత్రకళ!

వర్ణం పూయ
చిత్రం చిత్రించ
వలయునా?

SANTHANU'S CHITIRA VIDYALAYAM
1957 25 1982
SILVER JUBILEE

25 సంవత్సరములకుపైగా
తమ నమ్మకమునకును శక్తికును పేరు పొందిన

సంతనుని
చిత్ర విద్యాలయము ద్వారా

తపాలుద్వారా తెలుగు, ఆంగ్లము, తమిళము, మళయాలం మొదలగు 5 భాషలలో ఇంటిలో ఉన్నట్లే తమ చిత్ర అనుభవమును శక్తిను ఉపయోగ పద్ధతిలో అభివృద్ధి చేయువచ్చు.

పూర్తి వివరములకు 90 పైసలు స్టాంపులతో మనవిచేయుము:-

Santhanu's Chitira Vidyalayam
C/o CHITIRA KULLAN (J) Chintadripet, Madras-600 002